## క్లుప్తంగా

### ధర్మాజీగూడెంలో సినిమా షూటింగ్



షూటింగ్ ప్రారంభించిన అంబికా కృష్ణ

లింగపాలెం: పెళ్లిరోజు అనే సినిమా షూటింగ్ను శనివారం ధర్మాజీగూడెంలో ప్రారంభించారు. ఈ చిత్రానికి అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. నూతన నటీనటులతో దర్శకుడు వల్లభనేని సురేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ నేటితరానికి విడాకుల సమస్యలు ఎక్కువయ్యాయని, కలిసి ఉండాలనే కాన్సెప్ట్తో ఈ సినిమా తీస్తున్నారని అంబికా కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో లిడ్క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ పాల్గొన్నారు.

### వైభవంగా జాతర మహోత్సవాలు



కామవరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కామవరంలో గ్రామ దేవతల జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగోరోజు దుర్గమ్మతల్లి, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజులకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుట్టింటి పాన్పుపై కూర్చోపెట్టి ఒడిబియ్యం, కొలత బియ్యాన్ని భక్తులు సమర్పించారు. అదేవిధంగా అమ్మవారి పాన్పుతో గ్రామంలోని ఇంటింటికీ తీసుకువెళ్లి పసుపు, కుంకుమలతో వడి, కొలత బియ్యం సమర్పించి పూజలు చేశారు. ఉదయం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

### పారిజాతగిరిలో పూజలు



విశేషాలంకరణలో స్వామివారు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్ఠి, బాలభోగ నివేదన నిర్వహించిన అనంతరం భక్తులకి దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు డాక్టర్ సంజీవరావు గారు పుట్టినరోజు సందర్భంగా డాక్టర్లు శిల్ప, వంశీ, పావని అన్నదాతలుగా వ్యవహరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. అర్చకులు నల్లూరి రవికుమార్, రిషికేశ్, రాఘవాచార్యులు దాతలను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగ ప్రసాద్, వాసవి సాయి నగేష్ పాల్గొన్నారు

### అయ్యప్పకు అభిషేకం

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మండపారాధన, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కమిటీ సభ్యులు నెక్కలపూడి సూర్యచంద్రరావు, అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు సంకటహర చతుర్థి పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలోని అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీ కన్నెముల గణపతికి ఆదివారం సంకష్టహర చతుర్థి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ప్రధాన అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి పంచామృత అభిషేకాలు, గణపతి హోమం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని తరించాలని ట్రస్ట్ సభ్యులు కోరారు.

### రామభక్తులకు స్నాక్స్ అందజేత

కుక్కునూరు: భద్రాచలం శ్రీరాముడి దర్శనానికి 14వ సారి కాలినడకన కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, అచ్చంపేట నుంచి బయలుదేరిన 200 మంది భక్తబృందం శనివారం కుక్కునూరుకు చేరుకున్నారు. వారికి కుక్కునూరుకు చెందిన వాసవిక్లబ్ ఆధ్వర్యంలో బిస్కెట్లు, మిక్చర్ ప్యాకెట్లు, కూల్డ్రింక్లను అందజేశారు. వాసవిక్లబ్ రీజియన్ ఛైర్మన్ సమయమంతుల లక్ష్మణస్వామి, సెక్రటరీ చిన్న చంద్రమోహన్, ప్రెసిడెంట్ బాబురావు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- ఏడాది పొడవునా దిగుబడులు ఇస్తున్న ప్రకృతి సేద్యం
- ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఆకు కూరలకు డిమాండ్
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతున్న రైతులు



కంసాలికుంటలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు



దొరమామిడిలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు, ఆకు కూరలకు డిమాండ్ పెరిగింది. ఇటీవల కాలంలో ఐటీడీఏ, ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో సన్న, చిన్నకారు రైతులు వరి పంటతోపాటు మొక్కజొన్న పంటలు కూడా అధికంగా పండిస్తున్నారు. వీటితో పాటు కూరగాయల పంటలను కూడా అధికంగా వేస్తున్నారు. రైతులతోపాటుగా ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంటీలు, ఐసీఆర్లు కూడా ఒక్కొక్కరూ 20 సెంట్ల భూమిలో వంగ, మిరప, టమాట, తోటకూర, గోంగూర, చుక్కకూర, పాలకూర, తదితర పంటలను పండిస్తున్నారు. పండిన ఈ పంటలను స్టాల్స్గా ఏర్పాటు చేసి విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు.

**150 ఎకరాల్లో కూరగాయల సాగు**

నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 150 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటలు వేసినట్లు ప్రకృతి వ్యవసాయాధికారులు తెలిపారు. ఆయా మండలాల పరిధిలో 50 సెంట్ల భూమిలో ఆకుకూరలు, మిగిలినవి టమాట, వంగ, మిరపతోపాటు తీగజాతి మొక్కలు బీర, ఆనప, దుంప జాతికి సంబంధించి కేరట్, ముల్లంగి, తదితర పంటలను పూర్తి స్థాయి సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. జీవామృతం, ఘనామృతం, ద్రవామృతం తయారు చేసి పంటలకు ఎరువులుగా వేస్తూ పండిస్తున్నారు. ఈ కూరగాయల పంటలకు ఎటువంటి రసాయనిక ఎరువులు వేయకపోవడంతో ఈ కూరగాయలు కొనేందుకు ప్రజలు కూడా ఎగబడుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు ఆరోగ్యవంతమైనవి కావడంతో వీటిని కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

**తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం**

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 20 సెంట్ల భూమిలో కూరగాయల పంటలు పండిస్తున్న రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతున్నారు. 20 సెంట్లకు సంబంధించి రూ.3 వేలు పెట్టుబడి పెడితే నెలకు రూ.5 వేలు లాభం వస్తుందని ఆ రకంగా ఇప్పటి వరకూ 6 నెలలపాటు రూ.60 వేల వరకూ లాభం పొందినట్లు ఎంటీలు తెలిపారు. అంతేకాకుండా ఒక్కసారి పెట్టుబడి పెడితే ఏడాదిపాటు పంట దిగుబడి వస్తుందని అందుకే ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు పండిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

### రైతులను ప్రోత్సహిస్తున్నాం



నేను 20 సెంట్ల భూమిలో కూరగాయల పంటలు వేశాము. టమాట, వంగ, మిరప పంటలు వేశాము. కేవలం రూ.3 వేలు పెట్టుబడితో విత్తనాలు, నారు కొనుగోలు చేశాను. ప్రస్తుతం వారానికి రూ.5 వేల కూరగాయలు విక్రయిస్తున్నాం. కూరగాయల పంటల సాగును చేసే విధంగా రైతులను కూడా ప్రోత్సహిస్తున్నాం.

నక్కా శ్రీను, ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ, కంసాలికుంట

### 150 ఎకరాల్లో సాగు



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో సుమారు 150 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, దుంపల సాగు చేశాం. ఈ పంటలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. ఆరోగ్యవంతమైన పంటలు కావడంతో ఎక్కువమంది కొనేందుకు ఇష్టపడుతున్నారు.

– కె.కుమారవర్మ, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి, కంసాలికుంట

### ఆరోగ్యానికి మేలు



ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు రుచిగా ఉంటాయి. ఈ పంటలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా కూడా ఉంటారు. ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే ఏడాది పొడవునా పంట పొందవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయి.

– తెల్లం నాగలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్, బుట్టాయగూడెం

### అంతర్వేదిగూడెంలో తాటాకిల్లు దగ్ధం



తాటాకింటికి అంటుకున్న మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం: అంతర్వేదిగూడెంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో చోడెం రాంపండుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలి దగ్ధమైంది. ఆ సమయంలో రాంపండు, అతని భార్య దీపిక పొలం పనులకు వెళ్లగా గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఏడాది 2 ఎకరాలు కౌలుకు తీసుకుని వైట్ బార్లీ పంటను వేశానని, కూలీలకు ఇచ్చేందుకు ఇంట్లో ఉంచిన రూ.30 వేలు, దుస్తులు, సామాగ్రి పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో మిగిలామని రాంపండు వాపోయాడు. రాంపండు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## మెగా లోక్అదాలత్ను సద్వినియోగం చేసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



లోక్అదాలత్పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: మార్చి 8న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు కోరారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్అదాలత్లను వినియోగించుకోవాలని సూచించారు. క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతిరోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ సీఐ రవీంద్రనాయక్, ఎక్సైజ్ సీఐ పి అశోక్, టి నరసాపురం, ధర్మాజిగూడెం, తడికలపూడి ఎస్సైలు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**

చింతలపూడి సబ్జైల్ను జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలపై జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. క్షణికావేశాల్లో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతిఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు వంటశాలను, స్టోర్ రూంను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ కే అప్పయ్య, పీఎల్వీపీ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ బి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా రైతులకు కిసాన్ అవార్డులు



రైతులకు అవార్డులు ప్రదానం చేసిన దృశ్యం

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలోని శ్రీ సేవాలాల్ దేవాలయం నందు బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 15 మంది బంజారా రైతులకు శ్రీ సేవాలాల్ కిసాన్ అవార్డులను అందించారు. అవార్డులు అందుకున్న వారిలో దారావత్ శ్రీనివాస్ నాయక్, భూక్యా రవికుమార్, హాసావత్ మంగారావు, బాణావత్ శ్రీను, జరభల రమేష్ హసావత్ రాంబాబు, భరోత్ రాము, అజ్మీరా నాగేశ్వరావు, వెంకన్న బాబు, మహిళా రైతు బాణావత్ అన్నపూర్ణ ఉన్నారు. అనంతరం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్, బంజారా సీనియర్ నాయకులు బాదావత్ లక్ష్మణ స్వామి, సంఘ నాయకులు శివ నాయక్, జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్, సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

బుట్టాయగూడెం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే డిగ్రీ కళాశాల విద్యార్థులతో కొమ్ముగూడెం సచివాలయ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలను కూడా పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ మడకం రామలక్ష్మి, ఎస్సై దుర్గా మహేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ మణీంద్రరావు, ఎన్ఎస్ఎస్ పీఓ అక్కులన్న, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వివిధ కార్యాలయాలో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కులో పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి మాట్లాడుతూ ప్రజలు తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని పరిసరాలను వైద్యులు, సిబ్బంది శుభ్రం చేశారు.

పోలవరం రూరల్: స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీ చేపట్టారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, రోడ్లపై చెత్త వేయకూడదని, ప్రజలు సహకరించాలని కోరారు.



జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేసిన దృశ్యం

## పొట్టకూటి కోసం..



లింగపాలెంలో కత్తులు, కొడవళ్లు తయారు చేస్తున్న ఉత్తరప్రదేశ్ వాసులు

లింగపాలెం: ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన సుమారు 35 మంది జిల్లాలో పలుచోట్ల కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు, కత్తిపీటలను తయారు చేసి విక్రయిస్తూ పొట్ట నింపుకుంటున్నారు. ఏడాదిలో పది నెలలపాటు ఈ విధంగా రోడ్ల పక్కన తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసుకుని కత్తులు, కొడవళ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తారు. మిగిలిన రెండు నెలలు వారి ఇళ్లకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు. లింగపాలెం, భోగోలు, రంగాపురం తదితర గ్రామాల్లో వీరు తయారు చేస్తున్న రకరకాల పనిముట్లును ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం: ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో పి.బ్యూలా అంగన్వాడీలకు సూచించారు. పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం మూడో రోజు పోషణ్ బీ పఢాయి బీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆరోగ్యవంతంగా ఉండేందుకు పెరటి కూరగాయాలు, ఆకుకూరలు తీసుకోవాలని, ఆర్గానిక్ ఆహారంలో పోషకాలు ఎక్కువగా లభించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు కె.లక్ష్మి, ఎం.విజయలక్ష్మి, బీపీసీ కె.రాజు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మూడో రోజు శనివారం పోషణ్ బీ.. పఢాయి బీలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఏలూరు తులసి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యకు ప్రోత్సాహం, పిల్లల అభివృద్ధికి తగిన బోధనా పద్ధతులు అవలంబించడం ఆరోగ్య, పోషకాహార సేవలపై అంగన్వాడీ కార్యకర్తలు దృష్టి సారించాలని అన్నారు.

కొయ్యలగూడెం: ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ బీ.. పఢాయి బీ శిక్షణ, అవగాహన తరగతులు శనివారం ముగిశాయని ఐసీడీఎస్ పీఓ శారదా శనివారం పేర్కొన్నారు. హెల్త్ స్క్రీనింగ్, పౌష్టిక ఆహారంపై అవగాహన, గృహ సందర్శనలు మొదలగు వాటిపై అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



జంగారెడ్డిగూడెంలో పోషణ్ బీ పఢాయి బీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



చింతలపూడి: రేచర్లలో నిర్వహిస్తున్న సేవాలాల్ జయంతి



బుట్టాయగూడెం: కోయరాజమండ్రిలో సేవాలాల్కు నివాళులు



టి.నరసాపురం: కృష్ణాపురంలో సేవాలాల్ జయంతి

చింతలపూడి: లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు చింతలపూడి మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. రేచర్ల గ్రామంలో ఎంపీపీ దా రాంబాబు నాయక్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ మహరాజ్కు భోగ్ భాండార్ కార్యక్రమంలో భాగంగా దూప, దీప నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ తండాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్కు బడ్జెట్లో నిధులు కేటాయించాలని, సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

**చింతలపూడిలో ...**

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు చింతలపూడిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మారుతీనగర్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి రాజాబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సేవాలాల్ జెండాను ఆవిష్కరించి, సేవాలాల్కు నివాళులర్పించారు.

బుట్టాయగూడెం: లంబాడీ, బంజారాలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్రావు అన్నారు. గిరిజన లంబాడీల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు శనివారం కోయరాజమండ్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మోహన్రావు మాట్లాడుతూ సంత్ దేశంలోని గిరిజనులను ఏకతాటికి తీసుకువచ్చిన మహోన్నతమైన వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో దారావత్ చంద్రం, దారావత్ శ్రీను, బానోతు బాబూరావు, దారావత్ ప్రసన్నదేవి, బానోతు కృష్ణనాయక్, బానోతు పాపారావు, బి.వీరన్న, భూక్యా దుర్గారావు, రమేష్, గగ్గులోతు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు భూక్యా గాంధీ నాయక్ ఆధ్వర్యంలో కృష్ణాపురంలో భోగ్ భాండార్ మహా యజ్ఞంను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సమస్త మానవాళి ధర్మ మార్గంలో నడవాలని, ప్రకృతిని, ధన్యజీవులను, మహిళలను గౌరవిస్తూ జీవించాలని ఆయన హితబోధ చేశారని గాంధీ నాయక్ అన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు భూక్యా వాలి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహరాజ్ జయంతిని గుర్తిస్తూ లంబాడి ఉద్యోగులకు ప్రత్యేక సెలవు, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ధారావతు రమేష్, వాలి నాయక్, బాబూరావు నాయక్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు స్కూల్ క్లస్టర్ సమావేశాలు

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయులకు స్కూల్ క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని స్కూల్ క్లస్టర్ చైర్మన్, హెచ్ఎం కేఎస్వీ లోవకుమారి, మోనటరింగ్ అధికారి, జిల్లా గరల్స్, చైల్డ్ డవలప్మెంట్ అధికారి బి.నవీన కుమారి నిర్వహించారు. కేతవరం, తిరుమలపురం, జంగారెడ్డిగూడెం అర్బన్లోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఉప్పలమెట్టలలో పనిచేయు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరుకాగా వారికి పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు. డైట్ కాలేజీ దూబచర్ల నుంచి అబ్దుల్ అజీజ్ జిల్లా అబ్జర్వర్గా వ్యవహరించారు.

లింగపాలెం: మండలంలోని సింగగూడెం, ధర్మాజీగూడెం, రంగాపురం హైస్కూళ్లలో ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ స్థాయి ఉపాధ్యాయులకు శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జె.రవీంద్ర మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం క్లస్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో విద్యార్థులకు యాక్టివిటీల ద్వారా సులభతరంగా విద్యను బోధించాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంఈవో కె.రామారావు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

### సోలార్ లైట్ల ఏర్పాటు



గుబ్బల మంగమ్మ గుడి వద్ద సోలార్ లైట్లను ప్రారంభించిన దృశ్యం

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మగుడి వద్ద భక్తుల సౌకర్యార్థం సోలార్ లైట్లను శనివారం ఏర్పాటు చేశారు. ఇటీవల హైదరాబాద్కు చెందిన పి. చైతన్య సుధాకర్, బూరుగువాడకు చెందిన కుంజా నాగరాజు టెల్ టవర్ సోలార్ లైట్లు బహూకరించారు. ఈ లైట్లను ఆలయ కమిటీవారు ఏర్పాటు చేయగా చిర్రి కృష్ణయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోర్సా గంగరాజు, ఆలయ కమిటీ సభ్యులు గుజ్జు రామారావు, మడివి బొజ్జి, తదితరులు పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి గొయ్యిలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన నవీన్ శ్రీనివాసపురం గ్రామానికి కారులో వస్తుండగా సైకిల్ అడ్డు రావడంతో తప్పించబోయే కారు పక్కనే ఉన్న గొయ్యిలోకి దూసుకుపోయింది. కారులో నవీన్ ఒక్కరే ఉండడం, ఎవరికీ ఎవరికి ఎటుంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.